# కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట

**ఆసిఫాబాద్ టికెట్ కోసం మర్సుకోల సరస్వతి, రాథోడ్ గణేశ్ తీవ్ర ప్రయత్నాలు**

- ఇటీవల రిటైర్డ్ ఆర్టీవో శ్యాంనాయక్ చేరిక
- అధిష్టానం తమకంటే.. తమకే మద్దతు ఇస్తుందని ప్రచారం
- స్పష్టత ఇవ్వని హస్తం పార్టీ.. నేతల్లో ఆందోళన
- ఇటీవల జైనూర్‌లో రాథోడ్ గణేశ్ వర్గం, వాంకిడిలో సరస్వతి వర్గం పోటాపోటీగా ఆందోళనలు



రాథోడ్ గణేశ్‌కు టికెట్ ఇవ్వాలని జైనూర్‌లో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివాదాలకు కేరాఫ్‌గా నిలిచే కాంగ్రెస్ పార్టీలో అప్పుడే మూడు ముక్కలాట ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఎవరికి వస్తుందో స్పష్టత లేకపోయినా తమకంటే.. తమకే వస్తుందని నాయకులు ఇంతకాలం ప్రచారం చేసుకుంటూ వచ్చారు. తాజాగా కొత్త నాయకులు పుట్టుకొచ్చే సరికి టికెట్ల కోసం ధర్నాలు, రాస్తారోకోల స్థాయికి వెళ్తున్నారు. మర్సుకోల సరస్వతి, రాథోడ్ గణేశ్ ఎవరికి వారే తమకే టికెట్ వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో కొత్తగా రిటైర్డ్ ఆర్టీవో శ్యాంనాయక్ చేరడంతో ఇంతకాలం టికెట్‌పై ఆశలు పెంచుకున్న రాథోడ్ గణేశ్, మర్సుకోల సరస్వతి ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందని శ్యాంనాయక్ ప్రచారం చేసుకోవడంతో పాటు ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్ చేయిస్తున్నారు. దీంతో ఎవరికి వారే తమ వర్గీయులను పోగేసుకొని ధర్నాలు చేయిస్తున్నారు. నెల క్రితం రాథోడ్ గణేశ్‌కే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని ఆయన వర్గీయులు ర్యాలీ నిర్వహించగా, గురువారం వాంకిడిలో మర్సుకోల సరస్వతి వర్గీయులు రాస్తారోకో నిర్వహించారు.

### ఎవరికి వారే.. యమునా తీరే..

ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే.. యమునా తీరే.. అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీలో కొన్నేళ్లుగా పని చేస్తూ ఆశలు పెంచుకొన్న రాథోడ్ గణేశ్, మర్సుకోల సరస్వతీ వర్గాలు ఎవరికి వారుగా విడిపోయి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 6 నెలల క్రితం బట్టి విక్రమార్క పాదయాత్రలో సైతం మర్సుకోల సరస్వతీ వర్గం, రాథోడ్ గణేశ్ వర్గం మధ్య విభేదాలు బయట పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ వర్గం మర్సుకోల సరస్వతికి సపోర్ట్ చేస్తుండగా, మంచిర్యాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ వర్గం రాథోడ్ గణేశ్‌కు మద్దతు తెలుపుతున్నది. దీంతో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తారా స్థాయికి చేరాయి. మర్సుకోల సరస్వతీ వర్గం 10 రోజుల క్రితం ఆసిఫాబాద్‌లో రాస్తారోకో నిర్వహించింది. తాజాగా గురువారం కూడా వాంకిడిలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి మర్సుకోల సరస్వతికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెల రోజుల క్రితం జైనూర్‌లో రాథోడ్ గణేశ్‌కు చెందిన వర్గం ర్యాలీ నిర్వహించి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తంమీద ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మూడు ముక్కలుగా విడిపోయి టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. చివరికి అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.



మర్సుకోల సరస్వతికి టికెట్ ఇవ్వాలని వాంకిడిలో ధర్నా చేస్తున్న కార్యకర్తలు

**కుక్కల కొట్లాటలా కాంగ్రెస్, బీజేపీలు**



క్యాతనపల్లిలో డబుల్‌బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్



చెన్నూర్ పట్టణంలో 50 పడకల దవాఖాన ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, విప్ సుమన్





మందమర్రి పట్టణంలో మిషన్ భగీరథ మోటర్ స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి కేటీఆర్

# జజ్జనకరి జనాలే..

**అమాత్యులు కేటీఆర్, హరీశ్‌రావు సభలకు బ్రహ్మరథం**

**ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో దూసుకెళ్తున్న జననేతలు**

- ఒక దఫా నియోజకవర్గాలు చుట్టేసిన డైనమిక్ లీడర్లు
- గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిన పర్యటనలు
- ఏకపక్షంగా మారిన ముఖచిత్రం.. డైలమాలో ప్రతిపక్షాలు..
- అభ్యర్థులు ఎవరో తెల్చుకోలేని దుస్థితిలో కాంగ్రెస్, బీజేపీలు

మంచిర్యాల, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో నయాజోష్ కనిపిస్తున్నది. రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వరుస పర్యటనలతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు రెట్టించిన ఉత్సాహంతో కదం తొక్కుతున్నారు. మంత్రుల బహిరంగ సభలు, రోడ్ షోలకు భారీగా తరలివచ్చిన జనసందోహం చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొన్ని చోట్ల ఆ పార్టీలకు అభ్యర్థులు కూడా దొరక్క ముందే బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతుండడంతో ఏం చేయాలో తెలియని డైలమాలో ప్రతిపక్ష పార్టీలు, ఆ పార్టీల నాయకులు పడిపోయారు. పార్టీ తమకే టికెట్ ఇస్తుందా? ఇవ్వదా? తెలియక ఒకవైపు, బీఆర్ఎస్ పార్టీ దూకుడు ముందు తాము నిలబడగలుగుతామా అని మరోవైపు తలలు పట్టుకుంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అభ్యర్థులు ఎవరో తేల్చుకోలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉంటే, ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో బలం లేని బీజేపీ పార్టీ కొట్టుమిట్టాడుతున్నాయి. మరో బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థులు నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేసుకుంటూ దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న నాయకులు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిస్థితి బీఆర్ఎస్‌కు ఏకపక్షంగా మారింది. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

### చాట్ల తౌడు పోసి కుక్కల కొట్లాట

చాట్ల తౌడు పోసి కుక్కల కొట్లాట పెట్టినట్లు ఉంది ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలనుకునే అభ్యర్థులు భారీగా దరఖాస్తు చేయడం ఆ పార్టీకి ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో పది నుంచి ఇరవై మంది దరఖాస్తు చేసుకున్నారు. వార్డు మెంబర్లుగా ఓడిపోయిన వారు మొదలు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు అందరూ ఈ జాబితాలో ఉండడం గమనార్హం. ప్రతి నియోజకవర్గంలో వర్గాలు ఉండడం ఎవరికి వారు మాకే టికెట్ వస్తుందంటే, మాకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటూ వాళ్లలో వారే కొట్టుకుంటున్నారు. ఈ రోజు ఒకరు పర్యటించిన దగ్గరికే మరుసటి రోజు ఇంకొకరు వెళ్తున్నారు. దీంతో ఎవరితో పని చేయాలో తెలియక ఆ పార్టీకి ఉన్న కొద్ది పాటి కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ముందు నుంచి కష్టపడిన వారికి ఇప్పుడు టికెట్ వచ్చే పరిస్థితి లేదు. చాలా నియోజకవర్గాల్లో కొత్తగా వచ్చిన వారికి, ఉన్నఫలంగా వేరే పార్టీ నుంచి ఊడిపడిన వారికి టికెట్ ఇవ్వాలని అధిష్టానం భావిస్తుండడంతో ఏళ్లుగా పార్టీనే నమ్ముకొని పనిచేస్తున్న నేతల్లో అసంతృప్తి పెరుగుతోంది. టికెట్ దక్కని నాయకులు ఆ పార్టీకి సహకరించే పరిస్థితి లేదు. ఖానాపూర్‌లో 15, చెన్నూర్‌లో 14, బెల్లంపల్లిలో 10, ఆదిలాబాద్ 8, బోథ్‌లో 8, మంచిర్యాలలో 7, నిర్మల్, బోథ్, ఆసిఫాబాద్‌లలో నలుగురు చొప్పున, కాగజ్‌నగర్‌లో ముగ్గురు పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో నామమాత్రపు పోటీకే పరిమితం కానుంది. ఈ పార్టీలోనూ ఒక్కో దగ్గర ముగ్గురు నుంచి నలుగురు టికెట్‌ల కోసం పట్టు బిగుస్తున్నారు. కానీ.. బీజేపీ ఆదిలాబాద్‌లో ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కే అవకాశం లేదు.



మందమర్రి మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో జై తెలంగాణ నినాదాలు చేస్తున్న మహిళలు

### అభివృద్ధి మంత్రం.. హామీ తంత్రం..

జిల్లాలో ప్రధానప్రతిపక్షాలు బీజేపీ, కాంగ్రెస్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటే.. మరోవైపు గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ జనంలోకి వెళ్తున్నది. వెళ్లిన ప్రతిచోటా ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పనులను నాయకులకు జనాలకు వివరిస్తున్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కూడా తెలంగాణ రాక ముందు ఎట్లా ఉన్న జిల్లాను తెలంగాణ వచ్చాక ఎలా అభివృద్ధి చేసుకున్నామనే విషయాలను చెప్తున్నారు. ఎక్కడికక్కడ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిస్తున్నారు. ప్రతి నియోజకవర్గాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారాలు చూపిస్తున్నారు. కొత్త మండలాల ఏర్పాటు, చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు మొదలైన దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేరుస్తూనే, మరోవైపు ప్రస్తుతం ప్రజల్లో ఉన్న డిమాండ్లను నెరవేరుస్తామంటూ హామీలు ఇస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎక్కడికి వెళ్లిన జన నీరాజనం పడుతున్నారు. ఇటీవల నిర్మల్, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాల్లో ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలు, ర్యాలీలు సక్సెక్ అయ్యాయి. ఇవన్నీ చూస్తున్నా ఏం చేయలేని పరిస్థితుల్లో ప్రతిపక్షాల సతమతం అవుతున్నాయి.



చెన్నూర్‌లో ఆసుపత్రి ప్రారంభం అనంతరం వైద్య సిబ్బందితో సెల్ఫీ దిగుతున్న మంత్రి హరీశ్ రావ్



మందమర్రి పట్టణంలో చిన్నారిని ఎత్తుకున్న మంత్రి కేటీఆర్

# టూరిజం కారిడార్ దిశగా అడుగులు

**చారిత్రక చెరువుల్లో బోటింగ్**

- కోటలు, బురుజులకు కొత్తందాలు
- రూ.38 కోట్లతో ఫోర్‌లేన్
- పిక్నిక్ స్పాట్‌గా శ్యాంగఢ్ కోట
- రూ.12 కోట్లతో హరిత హోటల్ నిర్మాణం



విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న శ్యాంగఢ్ కోట, కోటలోకి వెళ్లేందుకు ప్రభుత్వం ఇటీవల వేసిన సీసీ రోడ్డు



బోటింగ్ ఏర్పాటు చేయనున్న బంగల్ పేట్ చెరువు

నిర్మల్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. చారిత్రక గొలుసుకట్టు చెరువులను టూరిజం స్పాట్లుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. మిషన్ కాకతీయ ఫలితంగా చెరువుల్లో యేడాది పొడువునా పుష్కలంగా నీరుండడంతో బోటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. చారిత్రక బంగల్ చెరువు, కంచరోని చెరువుల్లో బోటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేనున్నారు. శ్యాంగఢ్‌ను పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దనున్నారు. దీనిని అభివృద్ధి పనులు పూర్తి చేసి పర్యాటకులను రప్పించేందుకు కసరత్తు జరుగుతున్నది. బాసర నుంచి కదిలి పాపహరేశ్వరాలయం, నిర్మల్‌లోని కోటలు, బురుజులు, చెరువులు, కొయ్యబొమ్మల కేంద్రం, కడెం ప్రాజెక్టు, కవ్వాల్ అభయారణ్యంతోపాటు కుంటాల, పొచ్చెర జలపాతాలను కలుపుతూ ఈ టూరిజం కారిడార్‌కు రూపకల్పన చేశారు. పర్యాటకులకు ఆతిథ్యం కల్పించేందుకు స్థానికంగా గల పురాతన ఐబీలో రూ.12 కోట్లతో హరిత టూరిజం హోటల్‌ను నిర్మించనున్నారు. ఇప్పటికే ఐబీని తొలగించి మంత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. విశ్వనాథ్‌పేట నుంచి బంగల్‌పేట్ చెరువు మీదుగా రూ.38 కోట్లతో నూతన కలెక్టరేట్ వరకు ఫోర్‌లేన్ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఫోర్‌లేన్‌తోపాటు సెంట్రల్ లైటింగ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ఫోర్‌లేన్ పూర్తయితే సువిశాలమైన బంగల్ చెరువు టూరిజం స్పాట్‌గా మారనున్నది. బోటింగ్‌తోపాటు ఇక్కడ మినీ థీం పార్కు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అలాగే కంచరోని చెరువులో కూడా బోటింగ్ సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్ ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించడమే కాకుండా నిధులను మంజూరు చేసేందుకు హామీనిచ్చారు. ఇలా.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చొరవతో నిర్మల్ జిల్లాలోని చారిత్రక కట్టడాలు, సహజ సిద్ధమైన వనరులన్నీ పర్యాటక ప్రదేశాలుగా మారబోతున్నాయి. కాగా.. జిల్లాలో ఇప్పటికే దాదాపు 100 కోట్లను వెచ్చించి 600 పైగా దేవాలయాలను మంత్రి అల్లోల నిర్మింపజేశారు. ఇందులో భాగంగానే టూరిజం కారిడార్‌ను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. దీనిపై అధికారులతో మంత్రి సంప్రదింపులు జరిపి కార్యాచరణ రూపొందిస్తున్నారు.

### రూ.38 కోట్లు మంజూరు

నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట నుంచి బంగల్‌పేట్ చెరువు మీదుగా ఇటీవలే నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.38 కోట్లు మంజూరు చేస్తూ జీవో నంబర్ 460 జారీ చేసింది. ఆదిలాబాద్ వైపు నుంచి నిర్మల్ మీదుగా ఖానాపూర్, కడెం ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ రోడ్డు అనుకూలంగా మారనుంది. నిర్మల్ పట్టణంలోకి రాకుండానే ఈ ఫోర్‌లేన్ ద్వారా నేరుగా 61వ నంబర్ హైవే పైకి చేరుకోవచ్చు. అలాగే ఖానాపూర్, మామడ ప్రాంతాల ప్రజలు ఆదిలాబాద్ వైపు వెళ్లాలంటే కలెక్టరేట్ రోడ్డు నుంచి నేరుగా విశ్వనాథ్‌పేట్‌కు చేరుకోవచ్చు. దీంతో నిర్మల్ పట్టణంలో ట్రాఫిక్ భారం తగ్గనుంది. బంగల్ చెరువు పక్క నుంచే ఈ రోడ్డు వెళ్తుండడంతో పర్యాటకులకు అనుకూలంగా ఉంటుంది. ఒకవైపు బంగల్ చెరువును రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయనుండడం, మరో వైపు రోడ్డును విస్తరించడంతో సందర్శకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

### నిర్మల్ కేంద్ర బిందువుగా మారింది..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రకృతి సోయగాలను తిలకించేందుకు, ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు, భక్తులు భారీ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలు, చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాలకు పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నది. దీంతో ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులతోపాటు, పర్యాటకులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. దక్షిణ భారతదేశంలోనే ఏకైక బాసర సరస్వతీ అమ్మ వారి దర్శనానికి నిర్మల్ జిల్లాకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. అలాగే ఇక్కడికి సమీపంలోని కవ్వాల్ అభయారణ్యం, కడెం ప్రాజెక్ట్, కుంటాల, పొచ్చెర జలపాతాలను చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. ఆయా పర్యాటక ప్రాంతాలన్నింటికి నిర్మల్ కేంద్రబిందువుగా మారింది. నిర్మల్ పట్టణంలో చారిత్రక చెరువులతోపాటు కోటలు, బురుజులు ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసి పర్యాటకులు సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలోని రెండు పెద్ద చెరువుల్లో బోటింగ్ ఏర్పాటు చేసి చెరువు గట్టు వద్ద పార్కులను అభివృద్ధి చేస్తాం. సుదూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే పర్యాటకులు, భక్తుల కోసం నిర్మల్‌లో రూ. 12 కోట్ల వ్యయంతో ఇటీవలే అధునాతనంగా హరిత హోటల్స్ నిర్మాణ పనులను కూడా ప్రారంభించాం.

**- అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి**